# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## మసీదుల మరమ్మతులకు నిధులివ్వండి

### సిఎంకు మంత్రి రోజా వినతి



పుత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త : రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా నగరి నియోజకవర్గంలోని మసీదుల మరమ్మతుల కోసం నిధులు ఇవ్వాలని మంత్రి ఆర్.కె.రోజా ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిని కోరారు. దీనికి సంబంధించి ఉప ముఖ్య మంత్రి అంజాద్ బాషా, పుత్తూరుకు చెందిన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ వి.ఎం.మాహీన్‌లతో కలిసి ఆమె విజయవాడలో బుధవారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజక వర్గంలోని పుత్తూరు పట్టణంలో సిఎం ఇచ్చిన సుమారు రెండు కోట్ల రూపాయల నిధులతో జరు గుతున్న షాదీ మహల్ నిర్మాణం పూర్తి కావస్తోందని వివరిస్తూ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల్లో మసీదుల మరమ్మతులతో పాటు దర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

### ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను వివరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త: చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో గురువారం ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటల నుండి ప్రారంభం అయ్యే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పక్కాగా చేపట్టి పూర్తి చేయడానికి 916 మంది సిబ్బందిని నియమించినట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎలక్షన్ కమీషన్ జారీ చేసిన షెడ్యూల్ మేరకు ఈ నెల 13వ తేదీ ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల పోలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తిరుపతిలో రెండు పోలింగ్ బూత్‌లలో బుధవారం రీపోలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు గురువారం చిత్తూరు ఆర్‌విఎస్ లా కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నామన్నారు. ఓట్ల లెక్కింపు పక్కాగా చేపట్టి పూర్తి చేయడానికి అవసమైన అన్ని ఏర్పాట్లను చేపట్టి ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ సైతం ఇవ్వడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం 40 టేబుల్స్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో 193 కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో పరిశీలకులు కలిపి మొత్తం 916 మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

#### పక్కాగా ఓట్ల లెక్కింపు

ఓట్ల లెక్కింపు ప్రక్రియను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశభవనంలో బుధవారం రిటర్నింగ్ ఆఫీసర్ హరినారాయణన్ జెసి వెంకటేశ్వర్, ఏఆర్ఓ, డిఆర్ఓ రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి కౌంటింగ్ సిబ్బందితో ఓట్ల లెక్కింపుపై రిటైర్డ్ ఎజెసి, మాస్టర్ ట్రైనీ విఆర్ చంద్రమౌళి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఎలాంటి పొర బాట్లకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు కార్యక్రమంను పూర్తి అవగాహనతో అప్రమత్తంతో నిర్వహించి పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో విధులు నిర్వర్తించే సిబ్బందికి అవసరమైన అన్ని కనీస సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విధులు నిర్వర్తించే సిబ్బంది వారి ఆరోగ్యంపై జాగ్రత్తగా వుండాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓలు డాక్టర్ రేణుక, శివయ్య, సుజన, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గంగమిట్టపై కొలువుతీరిన

# పోలేరమ్మతల్లి



చిల్లకూరు మార్చి 15 ప్రభాతవార్త చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసియున్న పోలేరమ్మ అమ్మవారి జాతరలో భాగంగా రెండోవ రోజు బుధవారం ఆనవాయితీగా వస్తున్న పోలేరమ్మ చరిత్ర .కోటమండలం సిద్దవరం గ్రామంలోని పుట్టినిల్లు అయిన కుమ్మరి ఇంట నుండి పోలేరమ్మ మట్టిప్రతిమను చేసి మంగళవారం అర్దరాత్రి కనుపూరు గ్రామంలోని శ్రీబాల గురునాధస్వామి ఆలయం వద్దకు తీసుకొని వచ్చారు. అనంతరం గణాచార్యులు వారి గృహంలో వున్న అమ్మవారి ఆభరణాలకు పూజలు నిర్వహించి 101 రకాల నైవేద్యాలు సమర్పించి మేళతాళలతో గ్రామ బిక్షాటన చేశారు. గణాచార్యులు అమ్మవారి ఆభరణాలు తీసుకొని అలకలమిట్టకు తీసుకొని వెళ్లారు. అప్పుడు గ్రామ పెద్దలు మంగళవాయిద్యాలతో బాణా సంచిని కాలుస్తు పోలేరమ్మ అలకతీర్చి ఆభరణాలు అలంకరించి ఒబ్బాయి మిట్ట వద్ద దిష్టితీర్పు తీర్చి అక్కడ నుండి గ్రామ పొలిమేరలో గణాచారి నడకోకల పైన ముందునడుస్తు వెనుక ఒ వ్యక్తి అమ్మవారిని నెత్తిన పెట్టుకొని వచ్చారు. ఆసమయంలో భక్తులు ఎదురుకుమ్మాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లలు లేని మహిళలు వరపడ్డారు.వారిని దాటుకుంటు ముత్యాలమ్మ ఆలయంలో దక్షణ ద్వారం నుండి లోపలకు వచ్చి అక్కను పలకరించి ఉత్తర ద్వార గుండా బయటకు వెళ్ళి తూర్పు దిక్కున వున్న గంగమిట్ట వద్దకు తీసుకొని వచ్చి అక్కడ అమ్మవారికి కుంభం పోసి బలిగొర్రను అమ్మవారికి చూపించి దిష్టితీసి తరువాత తాత్కాలికంగా తాటి ఆకులతో ఏర్పాటు చేసిన గుడిసిలో బుధవారం ఉదయం 12 గంటకు పోలేరమ్మ అమ్మవారు కొలువుదీరింది.దీంతో జాతర ప్రారంభం అయింది.పోలేరమ్మను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడం జరిగింది.ముత్యాలమ్మ అమ్మవారికి వివిధరకాల పుష్పాలతో పూలాలంకరణ నిర్వహించారు.క్యూలైన్‌లో 100,40,20 తోపాటు ఉచిత దర్శనం క్యూ లైన్లు వెలవెల పోయాయి.దాతల సహాయంతో మంచినీరు, మజ్జిగ ప్యాకిట్లు అందించారు. చింతవరం ప్రాంతీయ వైద్యులు నాలుగు బృందాలుగా మెడికల్ క్యాంపులు నిర్వహించారు. జిల్లా జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఇఓ నవీన్‌కుమార్ ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనాంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా వేరూరు గ్రామానికి చెందిన డిఅశోక్ దంపతులు రూ.50 వేలు అమ్మవారికి విరాళంగా అందించారు. అదేవిధంగా చిల్లకూరు వాస్తవులు సిహెచ్‌రామచంద్రారెడ్డి 28,500 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి,మాజీ కమీటి సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి,దువ్వూరు సాయి కృష్ణారెడ్డి, ఉన్నారు.

# విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం

### ఎస్పీ రిశాంత్‌రెడ్డి



ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు నిర్వహించడాన్ని నిషేధిస్తున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎవరైనా దీనిని ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో గురువారం జరుగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి పోలీసు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు జారీ చేశారు. చిత్తూరు జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుండి పోలింగ్ అనంతరం వచ్చిన బ్యాలెట్ బాక్సులను ఎస్వీ సెట్ కళాశాలలో భారీ బందోబస్తు నడుమ భద్రపరిచామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై లైటింగ్, సిసి కెమెరాల పనితీరు, అభ్యర్థుల ఏజెంట్లు, అధికారుల వాహనాల ఎంట్రీ, పార్కింగ్ తదితరాలపై అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించేలా పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిగా సజావుగా జరిగేలా పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకొంటారన్నారు.

## బిల్డింగ్‌ప్లాన్ కోసం

# రూ.40 వేలు తీసుకుంటూ..

### ఎసిబికి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి




తడకండ్రిగ గ్రామ సచివాలయంలో ఎసిబి అధికారులు



తడలో మాట్లాడుతున్న ఎసిబి అధికారులు

తడ, మార్చి 15 ప్రభాతవార్త బిల్డింగ్ ప్లాన్ కోసం రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారు లకు దొరికిపోయాడో పంచాయతీ కార్యదర్శి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తడలో ఇటీవల ఇటువంటి మామూళ్లు ఎక్కువయ్యాయి. తడ, తడకండ్రిగ జంట పంచాయతీలలో భవనాలు, బహుళ అంతస్తుల భవ నాలు పెరిగిపోవడంతో అక్రమార్కులు ఇదే అవకాశాన్ని అందిపుచ్చు కుంటున్నారు. ఎసిబి అధికారులు బుధవారం సాయంత్రం ఈ అవినీతి కార్యక్రమాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న తడకండ్రిగ గ్రామ పంచాయతీ సచివాలయంలో నగదుతో పాటు రమణయ్య అనే పంచాయతీ కార్యదర్శి ఎసిబికి పట్టుబడ్డాడు. తిరుపతి ఎసిబి అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, ఎసిబి డిఎస్పీ జనార్దన్‌నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ వరదయ్య పాలెం మండలం చిలమత్తూరుకు చెందిన కిలారి రామకృష్ణ అనే బాధితుడు 14400 కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయడంతో తాము స్పందించినట్లు చెప్పారు. బాధితునికి సంబంధించి తడకండ్రిగలో ఇంటి స్థలం ఉందని, తన అల్లుడి పేరిట భవనం నిర్మించడానికి ప్లాన్ అప్రూవల్ కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నాడని చెప్పారు. ఈ నెల 10న బిల్డింగ్ ప్లాన్ కోసం రూ.50 వేలు లంచం అడిగాడని, మళ్లీ మంగళవారం మరోసారి సంప్రదించగా రూ.40 వేలు డిమాండ్ చేసినట్లు చెప్పారు. దీనితో తమకు ఫిర్యాదు చేసిన కారణంగా బుధవారం సాయంత్రం ఈ దాడులు జరిపినట్లు చెప్పారు. పట్టుబడిన పంచాయతీ కార్యదర్శిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎసిబి అధికారులు పేర్కొన్నారు. ఇదిలావుంటే రమణయ్య గత జులై నెల నుంచి తడకండ్రిగలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. అంతకుముందు ఆయన చాలాకాలం పాటు మరో పెద్ద గ్రామ పంచాయతీ తడకు పంచాయతీ కార్యదర్శిగా ఉన్నారు.

## సూళ్లూరుపేటలో

# దొంగల ముఠా హల్‌చల్

### - అంతర్ రాష్ట్ర ముఠా అనే అనుమానం



మోర్ సూపర్ మార్కెట్‌ను పగలగొట్టిన దృశ్యం

సూళ్లూరుపేట, మార్చి 15 ప్రభాతవార్త సూళ్లూరుపేట పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దొంగల ముఠా హల్‌చల్ చేసింది. నాలుగు షాపుల్లో చోరీకి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో కుదువ వ్యాపారి దుకాణం షట్టర్‌ను పగలగొట్టి తలుపులు తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఎదురుగా ఉన్న అష్టలక్ష్మి సూపర్ మార్కెట్ షట్టర్‌ను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. కాగా ఈ సూపర్ మార్కెట్‌ను గత కొంతకాలంగా మూసి వేసి ఉండటంతో అక్కడ ఏమీ లభించక వెను తిరిగారు. కోళ్లమిట్టలో ఉన్న మోర్ సూపర్ మార్కెట్ వద్దకెళ్లి షట్టర్ తలుపులను పగులగొట్టారు. సూపర్ మార్కెట్ అద్దాలను ధ్వంసం చేశారు. లోపలికి ప్రవేశించి కంప్యూటర్ టేబుల్ కింద ఉండే క్యాష్ డ్రాలను పగల గొట్టేందుకు ప్రయత్నం చేశారు. దీంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడ నుంచి ఈ ముఠా పరుగులు తీశారు. సిసి టివిలలో రికార్డయిన చిత్రాల ప్రకారం వీరు ఐదుగురుగా భావిస్తున్నారు. వీరు ముసుగులు ధరించి చోరీకి పాల్పడ్డారు. వీరందరూ తమిళనాడుకు చెందిన దొంగలుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఒక దొంగ దొరికినట్లు సమాచారం.

ఇదిలావుంటే సూళ్లూరుపేటలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న వరుస చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. గమండ్లవీధిలో పదిరోజుల క్రితం మూడు ఇళ్లలో చోరీలు జరిగాయి. కానీ, వీటిపై ఎటువంటి కేసులు నమోదు కాలేదు. ప్రస్తుతం పట్టణ నడిబొడ్డులో దొంగల ముఠా హల్‌చల్ చేయడం పోలీసుల పనితీరుకు సవాల్‌గా మారింది. రాత్రి వేళలో గస్తీని ముమ్మరం చేసి నిఘా మరింత తీవ్రతరం చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎమ్మెల్సీరీపోలింగ్ ప్రశాంతం

### 229 పోలింగ్ స్టేషన్‌లో 49.57 శాతం ఓటింగ్

### 233 పోలింగ్ స్టేషన్‌లో 44.07 శాతం ఓటింగ్

### కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, మార్చి15 ప్రభాతవార్త: తిరుపతిలో బుధవారం జరిగిన రీ పోలింగ్ ప్రశాంత వాతావరణం ముగిసినట్టు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. రెండు పోలింగ్ స్టేషన్‌లలో 46.39 శాతం పోలింగ్ జరిగినట్లు తెలిపారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఆదేశాల మేరకు తిరుపతిలో రెండు పోలింగ్ కేంద్రాలలో రీ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. తిరుపతి నగర పరిధిలో 229, 233 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు రీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రీ పోలింగ్‌కు సంబంధించి 229 పోలింగ్ కేంద్రానికి శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావును, 233 పోలింగ్ కేంద్రానికి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించి, పోలింగ్ కేంద్రం వెలుపల ఓటరు స్లిప్పులు, వీఆర్వోల ఏర్పాటుతో ఓటర్లకు అందజేయడం జరిగిందని తెలిపారు. పిఓలు,ఏపిఓలు, మైక్రోఅబ్జర్వులు ఏర్పాటుతో పాటు పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ పోలింగ్ కేంద్రం వెలుపుల వీడియో గ్రఫీ ఏర్పాటు చేసామని తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం 229 పోలింగ్ కేంద్రంలో 529 ఓటర్లకు గాను 287 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడంతో 49.57 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. 233 పోలింగ్ స్టేషన్ పరిధిలో 792 మంది ఓటర్లు ఉండగా 349 ఓటర్లు ఓటింగ్‌ను వినియోగించుకోగా 44,07శాతం ఓటింగ్ నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటరు సరళిని కలెక్టర్ పర్యవేక్షించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం సీల్ చేసిన బ్యాలెట్ బాక్స్‌లు సంబంధిత సామాగ్రితో బందోబస్తు నడుమ చిత్తూరులోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను కూడా కలెక్టరేట్ నుండి బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో చిత్తూరు స్ట్రాంగ్‌రూమ్‌కి తరలించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# పట్టు సడలని ఇంటర్ విద్యార్థి

### కాలికి తగిన గాయాన్ని సైతం లెక్కచేయకుండా

### ఆటోలో కూర్చుని పరీక్ష రాసిన విద్యార్థి రాహుల్



పెద్దపంజాణి మార్చి 15 ప్రభాతవార్త : రోడ్డుప్రమాదంలో కాలువిరిగి నడవలేని స్థితిలోఉన్న ఆ విద్యార్థి పట్టుదల వీడలేదు కష్టపడి ఏడాదిపాటు చదివిన ఆవిద్యార్థి పరిక్షరాసేందుకు శరీరం సహకరించలేదని ఇంట్లో కూర్చోలేదు ఆత్మస్థైరంతో పరీక్షరాసేందుకువచ్చి ప్రశంసలు అందుకున్నాడు.పరీక్ష అధికారుల ప్రత్యేక అనుమతితో ఆ విద్యార్థి ఆటోలో కూర్చొని తనలోని ఆత్మ విశ్వాసాన్ని చాటాడు.ఇందుకు సం బందించిన వివ రాలిలా.. పలమనేరు మండలం జల్లిపేటకు చేందిన రవిచంద్ర రాహుల్ పట్టణంలో మధుజూనియర్ కాలేజిలో సి.ఇ.సి మెదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కాలంలో ఓ ప్రమాదంలో తన కాలు విరిగి నడవలేని స్థితిలోవున్నఆడు.ఈ నేపథ్యంలో పరీక్షలు రాసేందుకు మండలంలోని రామా పురం సాయిశ్రీచైతన్య జూనియర్ కాలేజి పరీక్షకేంద్రం కావటంతో ఆటోలో చేరుకున్నాడు.పరీక్ష రాసేం దుకు వచ్చానని ఆటోలోనే పరీక్షరాసి వెళతానని అధికారులను కోరాడు.దీంతో అతని పటట్టుదలను గుర్తించిన అధికారులు ఆటోలోనే పరీక్ష రాసేందుకు అనుమంతించారు.కాగా పరీక్ష కేంద్రాన్ని ఎంపిడిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆటోలో పరీక్ష రాస్తున్న విద్యార్థికి ప్రత్యేక సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్,డిపార్ట్‌మెంట్ అధికారి రాజామణిశెట్టి,పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నమ్మ,మహిళా పోలీస్ నందిని తదితరులు పాల్గొన్నారు.

## గజరాజుల కట్టడికి

# అధునాతన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు

### గతంకు భిన్నంగా కంచె. .కుప్పం..పలమనేరు నియోజకవర్గాల్లో పనులు.. కీలకమైన ప్రాంతాల్లో పటిష్ట చర్యలు !!



కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో గజరాజులు తరచూ ప్రవేశించి పంటలపై దాడులు జరుపుతున్న విషయం విదితమే.దీంతో గజరాజుల దాడులు ఈ ప్రాంతాల్లో నిరోధించేందుకు రాష్ట్ర అటవీ, గనులు, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవ చూపారు. ఏనుగులు సరిహద్దుల నుంచి ఆంధ్ర ప్రాంతంలో ప్రవేశించే ప్రాంతాల్లో కొత్తగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం సోలార్ ఫెన్సింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం ననియాల తాండా వద్ద సుమారు 2.5కి.మీ.ల మేర కొత్తగా సోలార్ కంచె ఏర్పాటుచేస్తున్నారు. అలాగే గుడుపల్లె మండలం సంగనపల్లి, మల్లప్ప కొండ ప్రాంతాల్లో 2కి.మీ.ల దూరం మేర సోలార్ కంచెలను కొత్తగా నిర్మిస్తున్నారు. అలాగే పలమనేరు నియోజకవర్గంలో సైతం పలుచోట్ల కంచెలను నిర్మిస్తున్నారు. గతంలో అయితే సోలార్ కంచెను రాతి స్థంభాలు నాటి వాటికి సోలార్ కంచెను ఏర్పాటుచేసేవారు. అయితే ప్రస్తుతం రాతి స్థంభాల స్థానంలో కొంత ఇనుప పైపులు నాటి ఏనుగులు ప్రవేశించే కందకాల వెంబడి పొడవుగా సోలార్ కంచెను ఏర్పాటుచేస్తున్నారు. ఈపనులు పూర్తయ్యాక మిగతా సమస్యాత్మక ప్రాంతాల్లో సైతం సోలార్ ఫెన్సింగ్ పనులు చేపట్టనున్నారని సమాచారం. కాగా గతంలో ఒక్క కుప్పం నియోజకవర్గంలోనే సుమారు 140కి.మీ.ల మేర అటవీ ప్రాంతంలో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. అయితే కాలక్రమేణా ఈ ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా చేసే బ్యాటరీలు పాడైపోవడం పలుచోట్ల ఫెన్సింగ్ రాతి స్థంభాలు నేలకూలడం తదితరాలతో సోలార్ ఫెన్సింగ్ కంచెలు పనికి రాకుండా పోయాయి. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వం ఏనుగులు సులువుగా ప్రవేశించే ప్రాంతాల్లో వాటి నిరోధానికి సోలార్ కంచెను ఆధునాతన రీతిలో ఏర్పాటుచేస్తుండడం పట్ల అటవీ సరిహద్దు ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌ను లీజుకు ఇవ్వవద్దు

- తెలుగుదేశం, జనసేన డిమాండ్

బంగారుపాళ్యం, మార్చి 15 ప్రభాతవార్త:

మండల కేంద్రం బంగారుపాళ్యంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వరాదని తెలుగుదేశం, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దేశం కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ లక్షలాది రూపాయల వ్యయంతో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించిందన్నారు. 42 సెంట్ల ప్రభుత్వ భూమిని బస్టాండ్ నిర్మించడానికి కేటాయించారన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు ఈ బస్టాండ్‌ను 15 సంవత్సరాల పాటు ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ బస్టాండ్‌ను పునరుద్ధరించి ప్రజలకు మరింత సౌకర్యం కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వంశీకృష్ణచౌదరి, విజి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు ఈ బస్టాండ్ ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వరాదంటూ తహసిల్దారు బెన్నురాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆవులశాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎంఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్‌చే అన్నదానం

కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త

కుప్పం మాజీ ఎంఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ బుధవారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తన కుమార్తె గాయ త్రి వినోద్ జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా ఆయన సుమారు 500మందికి అన్నదానం నిర్వహించారు. పేదలకు అన్నదానం చేసే అవకాశం కల్పించిన తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, అన్న క్యాంటీన్ నిర్వాహకుడు బిఎంకె రవిచంద్రకు ధన్యవాదాలు తెలిపారు. ఎవరైనా అన్నదానం చేయాలనుకునే వారు కుప్పం తెదేపా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, కౌన్సిలర్ సోమశేఖర్, త్రివేణి సత్యేంద్రశేఖర్, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు చెక్కునత్తం మణి, బిసి సెల్ అధ్యక్షుడు మురళి, నడిమూరు సర్పంచ్ జెకె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కుప్పంరూరల్, మార్చి 15 ప్రభాతవార్త



ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ఉదయం 9గంటలనుంచి పరీక్ష సమయం ప్రారంభం కాగా విద్యార్థులు 8గంటలనుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. కుప్పం పట్టణంలోని ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కళాశాలలు, వికాస్ జూనియర్, కుప్పం జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు.

## నిరాశ్రయులను అన్నివిధాలా ఆదుకుంటాం

-వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

పుంగనూరు,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

పట్టణాన్ని ఆధునీకరించే యత్నాల్లోభాగంగా పుంగమ్మ చెరువుకట్టపై అనధికారికంగా ఉంటున్న నివాసాలు కోల్పోయిన వారి కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా అన్నారు.బుధవారం ఉదయం కమీషనర్ నర్సింహప్రసాద్‌తోకలసి ఆయన నిరాశ్రయ కుటుంబాలతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి,ఎంపి మిధున్‌రెడ్డిల సూచనలమేరకు రూ.5లక్షల విలువైన ప్రభుత్వస్థలం ఇచ్చి,వారికి రూ.1.80లక్షల విలువైే గృహనిర్మాణాలు పూర్తిచేసి ఇస్తామన్నారు. కాగా నిరాశ్రయులు మాట్లాడుతూ ఉన్నపళంగా తమను వీధినపడవేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందారు. కార్యక్రమంలో వైస్ నాగేంద్ర,కౌన్సిలర్లు,వైకాపా మైనార్టీ నాయకుడు ఖాన్,అధికార సిబ్బంది పాల్గొన్నారు.

## సంత్‌సేవాలాల్ సేవలు ఆదర్శనీయం: బిఎం నాయక్

పుంగనూరు,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



ప్రకృతిపట్ల మానవులు ఎంత కృతజ్ఞతలతో మెలగాలో బంజారాలు ఆచరించి చూపుతున్నారని బంజారాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి తెలియచెప్పిన మహాఆదర్శవాది శ్రీశ్రీశ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ సేవలు ఆదర్శనీయమని ఎస్సీఎస్టీ కమీషన్ జిల్లా సభ్యుడు బాణావత్‌ము నేంద్రానాయక్ అన్నారు.బుధవారం సుగాలిమిట్ట వద్దగల గిరిజన వృద్ధాశ్రమంలో జరిగిన సంత్‌సేవాలాల్ 284వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాగరిక సమాజానికి దూరంగా ఉన్నప్పటికీ గిరిజన కుటుంబాలలో పద్ధతి,సంప్రదా యాలు,ఆచారాలు ఎంతో నియమాలతో ఉంటాయన్నారు.అంతేకాకుండా ధర్మబద్ధమైన ప్రశాంతజీవనాన్ని గడపడానికి బంజారాలు శతాబ్దాల తరబడి అలవాటుపడ్డారన్నారు.ఈసందర్భంగా ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట నాగేనాయక్,బుక్యాభానుప్రసాద్,రమణానాయక్,శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో వాహనాలు వేలం పాట

వెదురుకుప్పం, మార్చి 15 ప్రభాతవార్త :

వెదురుకుప్పం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వాహనాల వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఏఎస్ఐ వెంకటేష్ తెలిపారు. కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ ఉత్తర్వుల మేరకు ఏఎస్ఐ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో పలు రకాల కేసులలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని, ఆశావాహులు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొని వాహనాలను సొంతం చేసుకోవాలని పోలీసు అధికారులు తెలిపారు.

## కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించిన జెసి వెంకటేశ్వర్

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:



ఎస్‌వి సెట్ కళాశాలలో సోమవారం జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం పట్టభద్రుల సహాయ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనీ, రిటైర్డ్ ఎజెసి వీఆర్ చంద్రమౌళి, ఆర్డీఓలు డాక్టర్ రేణుక, శివయ్య, ట్రైనీ డిప్యుటీ కలెక్టర్ కిరణ్మయి, పూతలపట్టు తహసిల్దారు విజయభాస్కర్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

## టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత

పాలసముద్రం, మార్చి 15 ప్రభాతవార్త:



టెన్త్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని డివైఇఓ చంద్రశేఖర్ అన్నారు. ఆముదల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం టెన్త్ పరీక్షల ఉత్తీర్ణతా శాతం పెంపుపై ఉపాధ్యాయులతో డివైఇఓ చంద్రశేఖర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివైఇఓ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు సిలబస్ రివైజ్ చేసి చదువులో వెనుకబడిన విద్యార్థులు పరీక్షలు బాగా రాయడానికి అవసరమైన శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం డివైఇఓ మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, హెడ్మాస్టర్ గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అవ్వతాతలకు 3వ తేదీ పెన్షన్లు

పాలసముద్రం, మార్చి 15 ప్రభాతవార్త:

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవ్వతాతలకు ప్రతినెల ఒకటవ తేదీ పంపిణీ చేస్తున్న సామాజిక పెన్షన్లను ఏప్రిల్ నెలలో 3వ తేదీ పంపిణీ చేయనున్నారని దీనికి అవ్వతాతలు సహకరించాలని మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ పేర్కొన్నారు. పాలసముద్రంలో బుధవారం అవ్వాతాతలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2 తేదీల్లో ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో ఏప్రిల్ నెల 1వ తేదీ అవ్వాతాతలకు చెల్లించే పెన్షన్లను ఏప్రిల్ నెల 3వ తేదీ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.జడ్పీటీసీ అన్బుగలన్, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

బంగారుపాళ్యం, మార్చి 15 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ పివిఆర్ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షా కేంద్రంలో జనరల్ గ్రూప్ కింద 196 మంది విద్యార్థులను కేటాయించగా 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు 182 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అలాగే వృత్తి విద్యా కోర్సు పరీక్షలకు సంబంధించి 73 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 65 మంది హారయ్యారు. ఈ పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ పి.మురళీకృష్ణ, డిపార్ట్‌మెంటల్ అధికారి నాగేంద్రలు తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు.

## 19న కుప్పం మండల మీట్

**కుప్పం, మార్చి 15 ప్రభాతవార్త** కుప్పం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 19న ఆదివారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిపి అశ్విని మురుగేష్, ఎంపిడిఓ జానకమ్మ తెలిపారు.అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిసభ్యులు, సర్పంచులు తప్పక హాజరు కావాల ని కోరారు.

## ప్రభుత్వ ఐటిఐలో స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

**శాంతిపురం, మార్చి 15 ప్రభతావార్త** శాంతిపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో స్వల్పకాలిక కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. 18-45ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులన్నారు. ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ వెల్డర్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు 8074564049,9704624408నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిన్నారి వైద్యం కోసం దాతల ఆర్థిక సాయానికి ఆర్థింపు

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:



మూర్ఛ, శ్వాసవ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్యం కోసం తల్లిదండ్రులు దాతల ఆర్థిక సహా యంను ఆర్థిస్తున్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యాదమరి మండలం కీనాటంపల్లి హరిజనవాడకు చెందిన చిన్నారి తల్లిదండ్రులు శివకుమార్, ఝాన్సీలు మాట్లాడుతూ తాము బెంగళూరులో కూలీ పనులు సాగించుకొంటూ జీవనం చేస్తున్నామని తమకు మొదటి కాన్పులోనే ఆడబిడ్డ పుట్టడంతో సంబరపడ్డామన్నారు. ఆరు నెలలకు వేసే రెండవ టీకా వేసిన సందర్భంలో టీకా వికటించడంతో పాపకు విపరీతంగా జ్వరం వచ్చి మూర్ఛ రావడంతో బెంగళూరులోనే చిన్న పిల్లల ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా పాపకు శ్వాస పీల్చడం ఇబ్బందికరంగా మారిందన్నారు. వైద్యులు వెంటిలేటర్ సహాయంతో పాపను రక్షించారన్నారు. అప్పటి నుండి చిన్నారికి తరచూ ఇలాగే వస్తుండటంతో ఆసుపత్రుల్లో పాప వైద్యం కోసం ఇప్పటి వరకు 11 లక్షల రూపాయలు ఖర్చు చేశామన్నారు. దాతలు ముందుకు వచ్చి ప్రాణాపాయంలో వున్న తమ పాపకు ఆర్థిక సహాయం అందించి సరైన వైద్యం చేసి రక్షించాలని వారు వేడుకొన్నారు. దాతలు ఎవరైనా సహాయం చేయదలిస్తే వి.శివకుమార్, యూనియన్ బ్యాంక్, యాదమరి, అకౌంట్ నెం.42330 2010078896. ఫోన్‌పేనెం.81977 53717కు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## ప్రేమ పేరుతో మోసపోవద్దు... : డిఐజి రవిప్రకాష్

-ఫోక్సో చట్టంపై అవగాహన అవసరం -నేరాల అదుపుకు ప్రత్యేక చర్యలు

సదుం, మార్చి 15 ప్రభాతవార్త



మైనర్ బాలికలు మోసగాళ్ళ ప్రేమాయణంలో పడి అబాసుపాలు కావద్దని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ అన్నారు. చౌడేపల్లిలోని పుంగనూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన బుదవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోక్సో చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు ఆయా పోలీస్టేషన్‌లు, సచివాలయాల్లోగల మహిళా పోలీసులు బాలికలు, మహిళలకు పలు ప్రచార సాధనాలు, మాద్యమాలతోనే కాకుండా సమావేశాలేర్పాటు చేసి వారికి తెలియజేయాలన్నారు. ఫోక్సో కేసులో ముద్దాయిలపై ఫోక్సోషీట్ ఓపెన్‌చేసి వారిపై నిరంతరం నిఘా వుండేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకటికంటే ఎక్కు ఫోక్సోచట్టం కేసులుంటే ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో పనిచేస్తున్న వారి ఉద్యోగాల నుంచి తొలగించబడతారన్నారు. చౌడేపల్లి మండలంలోని శక్తిక్షేత్రం బోయకొండలోనూ నేరాల అదుపుకు చర్యలు తీసుకొంటున్నామనీ, బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన సేవనకు బ్రేక్ వేసేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. ఎన్నికలు వస్తున్న తరుణంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఇప్పటి నుంచే నిఘా పెట్టాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు. ఉచిత బహుమతుల కేటుగాళ్ళ జోలికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేసారు. జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పలమనేరు డిఎస్పీసుధాకర్‌రెడ్డి,పుంగనూరు రూరల్‌సిఐ మదుసూధన్‌రెడ్డి, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి



-జిల్లా పంచాయతీ అధికారిణి లక్ష్మీ

తవణంపల్లె, మార్చి 15 ప్రభాతవార్త:

భూసర్వే భూమి చట్టం సర్వేలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిణి లక్ష్మీ తెలిపారు. మండలంలోని తవణంపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని ఉత్తర బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను డీపీఓ లక్ష్మీ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా సర్వే జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. భూహక్కు చట్టం స్వామిత్వ సర్వేను ఏవిధంగా నిర్వహించాలనే విషయమై గ్రామ సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలో భాగంగా ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ఆభూములను ప్రభుత్వ స్థలంగా గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉత్తర బ్రాహ్మణపల్లె, తవణంపల్లె పంచాయతీల కార్యదర్శులు టి.చంద్రశేఖర్, శ్రీరాములు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మోటార్‌సైకిల్ బోల్తా -ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట రూరల్ మార్చి 15 ప్రభాతవార్త;

నాయుడుపేట మండలంలోని బిరదవాడ సమీపంలో జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్ బోల్తాపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది.సేకరించిన సమాచారం మెరకు వివరాలిలా ఉన్నాయి.సూళ్ళూరుపేటకు చెందిన కార్తీక్,రాజేష్ ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటకు వచ్చి పనులు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామమైన సూళ్ళూరుపేటకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో బిరదవాడ-శ్రీనివాసపురం మధ్యకు వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని క్రాస్‌చేయబోయి ప్రమాధవశాత్తు అదుపుతప్పి మోటార్‌సైకిల్ బోల్తాపడింది.దీంతో కార్తీక్,రాజేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ప్రయాణికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు.నాయుడుపేట పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

కోట, మార్చి 15 ప్రభాతవార్త

ఇంటర్మీటీయట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు కోట మండలంలో బుధవారం ప్రారంభయ్యాయి. ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో 285 మందికి గాను 276 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా కోట ఎస్సీ గురుకుల పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రోజుమార్చిరోజు ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ఈ పరీక్షలు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించేది లేదని అధికారులు చెప్పారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని చెప్పారు.

## అంబలి వితరణ

కోట, మార్చి 15 ప్రభాతవార్త

చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో శ్రీ ముత్యాలమ్మ జాతర సందర్భంగా కోట గాంధీబొమ్మ సెంటర్ వద్ద అంబలి ప్రసాదం వితరణ జరిగింది. కోటకు చెందిన మల్లికార్జున్, సారంగం కిషోర్, డాక్టర్ గాది శ్రీనివాసులు దాతృత్వంతో జాతరకు వెళ్లే భక్తులకు అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పోలేరమ్మ జాతర సందర్భంగా ప్రతి సంవత్సరం భక్తులకు అంబలి వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

## అనుమతి లేని ఇటుక బట్టీలు

కోట, మార్చి 15 ప్రభాతవార్త

కోట మండలం తిమ్మానాయుడుపాలెం, రంగన్నగుంట గ్రామాల వద్ద అనుమతులు లేకుండా ఇటుక బట్టీల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని ఇటుక బట్టీ వ్యాపారం చేయాల్సి ఉన్నా ఇక్కడ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు ఉండాలి. కానీ, నిర్వాహకులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారికి కళ్లలో పొగ, దుమ్ముధూళి పడుతుండటంతో ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల ఆయా గ్రామాల ప్రజలు అక్రమ ఇటుక బట్టీల గురించి జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు.

## ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

దొరవారిసత్రం, మార్చి 15 ప్రభాతవార్త



దొరవారిసత్రంలోని మహాత్మా జ్యోతిపూలే బిసి గురుకుల పాఠశాలలో బుధవారం మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎపిమోడల్ స్కూల్, బిసి గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 129 మంది విద్యార్థులకు గాను 128 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రారంభానికి ముందే నాయుడుపేట సీఐ వైవి సోమయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుమలరావు, పోలీసు సిబ్బంది పరీక్షా కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతి విద్యార్థిని తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు.

## వాటంబేడులో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

తడ, మార్చి 15 ప్రభాతవార్త



తడ మండలం వాటంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆశ్ర వినియోగదారుల హక్కుల సంస్థ తిరుపతి జిల్లా ప్రతినిధి ఉస్మాన్‌బాషా ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు ఏ వస్తువులు కొన్నప్పటికీ బిల్లు అడిగి తీసుకోవాలని సూచించారు. ఆశ్ర సంస్థ ద్వారా ఇప్పటికి కనీసం రెండు లక్షల మంది వినియోగదారులకు సేవలు అందించామన్నారు. విద్యార్థి దశ నుంచి వినియోగదారులు తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. 2019 వినియోగదారుల హక్కుల చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిఆర్‌పి మునీష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తడలో మోటార్‌బైక్ చోరీ

తడ, మార్చి 15 ప్రభాతవార్త

తడ మండలం చేనిగుంటకు చెందిన కొమ్మల నాగభూషణం తన మోటార్‌బైక్ అపహరణకు గురైనట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగభూషణం కుమారుడు నరేంద్ర తన మోటార్‌బైక్‌ను ఉపయోగించుకుంటున్నాడని, ఇంటి ముందు రోడ్డులో పార్కు చేసి తాళం వేసి ఉదయాన్నే చూడగా, అపహరణకు గురైందని పేర్కొన్నారు. ఇదిలావుంటే మంగళవారం రాత్రి తడ-శ్రీకాళహస్తి మార్గంలోని ఒక సెల్‌ఫోన్ షాపులో చోరీ జరిగినట్లు తెలుస్తోంది. అయితే సాయంత్రం దాకా ఈ సంఘటన మీద పూర్తి సమాచారంతో పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

## గ్రామదేవత శ్రీపోలేరమ్మ జాతర చాటింపు

నాయుడుపేట, మార్చి 15 ప్రభాతవార్త



నాయుడుపేట గ్రామదేవత శ్రీపోలేరమ్మ జాతర చాటింపు కార్యక్రమం మంగళవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీపోలేరమ్మ జాతర మే 1, 2, 3 తేదీలలో నిర్వహించేందుకు జాతర చాటింపు కార్యక్రమం రంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన శ్రీపోలేరమ్మ అమ్మవారి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమను పట్టణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో శ్రీపోలేరమ్మ ఆలయకమిటీ ఛైర్మన్ గందవల్లి సిద్దయ్య, విన్నమాల పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నల్లబోతుల రామారావు, ఆకుల కుబేరమణి, శేషగిరి, గాదిరెడ్డి గోపి, మెస్ భాస్కర్‌రెడ్డి, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన గూడూరు ఎమ్మెల్యే

గూడూరు, మార్చి 15 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గూడూరు ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గూడూరు పట్టణ ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయడానికి అవసరమైన అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే వరప్రసాద్ కోరారు. ఖచ్చితంగా రాబోయే బడ్జెట్ సమావేశం జరిగిన వెంటనే పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఫ్లైఓవర్ పనులు ఐదేళ్ల కాంగ్రెస్ హయాంలో, మరో ఐదేళ్ల తెలుగుదేశం హయాంలో ఫ్లైఓవర్ పనులు జరగకుండా ఉండిపోయిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతు మూడుసార్లు టెండర్ పిలిచినప్పటికీ గిట్టుబాటు రేట్లు లేకుండా టెండర్లు నిలిచిపోయాయని తెలిపారు. టెండర్‌దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ముఖ్యమంత్రి మా కోరికను మన్నించి కాంట్రాక్టర్లను ఆకర్షించే విధంగా మంచి రేట్లు ఇచ్చారని తెలిపారు. అలాగే గూడూరు ఆటోనగర్‌కు సంబంధించి ఏపీఐఐసీ ఎండీ సుజన, పరిశ్రమల చీఫ్ సెక్రటరీ కరికాల వల్లవన్‌లను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. వారు కూడా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు.

## శ్రీ స్వర్ణాంధ్ర భారతి స్కూల్లో నో బ్యాగ్ డే

**గూడూరు, మార్చి 15 ప్రభాతవార్త** గూడూరు రెండో పట్టణ పరిధిలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూలులో నో బ్యాగ్ డే సందర్భంగా బుధవారం వివిధ రకాల కార్యక్రమలు నిర్వహించారు. అందులో భాగంగా పిల్లల్లో ఐక్యతను పెంచడానికి వంటల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పచ్చళ్ళు, పిల్లలు తయారు చేస్తారు. పచ్చళ్లు తయారుచేయడానికి అవసరమైన సామగ్రిని కూరగాయల మార్కెట్‌లో విద్యార్థులు కొనుగోలు చేశారు. ఊరగాయల తయారీ, వాటి నిల్వ గురించి పిల్లలకు ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.నవకోటినాయుడు, అకడమిక్ డీన్ సునీల్, అకడమిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ ఎన్.సాయిసింధు గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## దుర్గంకొండ,అగస్తీశ్వరకొండలకు ప్రత్యేక బస్సులు

పుంగనూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

మహాశివరాత్రి సందర్భంగా పుంగనూరు వద్ద శ్రీఅగస్తీశ్వరాలయ నెక్కొంది కొండ, పెద్దఉప్పరపల్లి దుర్గంకొండల క్షేత్రాలకు వెళ్ళేభక్తుల కోసం మంత్రిపెద్దిరెడ్డి సూచనలతో ప్రత్యేక బస్సుసర్వీసులు ఏర్పాటుచేసినట్లు ఆర్టీసి డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. రూ.55 ఛార్జీతో సోమల నుంచి దుర్గంకొండకు పది బస్సులు ఏర్పాటుచేశామన్నారు. అదేవిధంగా రూ.50చార్జీతో నెక్కొంది కొండకు పుంగనూరు నుంచి 15 బస్సులు,చౌడేపల్లినుంచి నాలుగు బస్సులు ఏర్పాటచేసినట్లు తెలిపారు. ప్రజలు ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఇలా....!

- పోలైన ఓట్లలో సగం ఓట్ల కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థి విజేత

**చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ స్థానంకు జరిగే ఓట్ల లెక్కింపుకు ఎమ్మెల్యే స్థానానికి జరిగే ఓట్ల లెక్కింపుకు చాలా వ్యత్యాసం వుంది. ఎమ్మెల్యే స్థానానికి నిర్వహించే ఓట్ల లెక్కింపులో ఏ అభ్యర్థి అయితే అందరి కంటే ఎక్కువ ఓట్లు సాధిస్తారో ఆ అభ్యర్థిని ఎన్నికల సంఘం ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు ప్రకటిస్తుంది. అయితే శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థికి పోల్ అయిన ఓట్లలో 50 శాతం సాధించి ఆపై ఒక్కఓటు అధికంగా వచ్చిన అభ్యర్థిని ఎలక్షన్ కమీషన్ ఎమ్మెల్సీగా విజయం సాధించినట్లు ప్రకటిస్తుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో అభ్యర్థి విజయానికి ప్రాధాన్యతా ఓట్లకు అధిక ప్రాధాన్యత వుంటుంది. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ఎలా జరుగుతుందనే విషయంను తెలుసుకొందాం.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఎలా చేస్తారంటే...**ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంకు మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌కు మొత్తం 3,79,810 ఓటర్లు వుంటే అందులో 2,68,387 మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొని ఓట్లు వేశారు. పోలైన ఓట్లలో సగం ఓట్లతో పాటు ఒక్క ఓటు అధికంగా వచ్చిన అభ్యర్థిని ఎన్నికల కమీషన్ విజేతగా ప్రకటిస్తుంది. ఈ ఎన్నికల్లో ఏ అభ్యర్థికి అయితే 1,34,193.5తో పాటు ఒక్క ఓటు అధికంగా వస్తే ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అప్పటి వరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు కొనసాగిస్తారు. పోలింగ్ రోజున ఓట్లు వేసే అభ్యర్థులు ఎన్నికల పోటీలో వున్న 22 మంది అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓట్లు వేస్తారు. ఓటర్లు తాము వేయాల్సివున్న అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎన్నికల బరిలో నిలిచిన మిగిలిన అభ్యర్థులకు రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ ప్రాధాన్యత ఓట్లను ఓటర్లు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులందరికీ వేయాల్సివుంటుంది. ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఓట్ల లెక్కింపు సిబ్బంది మొదట ఎన్నికల బరిలో నిలిచిన 22 మందికి లభించిన అభ్యర్థుల మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. మొదట ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే ఏ అభ్యర్థికైనా సగం కంటే ఒక్క ఓటు ఎక్కువ వస్తే ఆ అభ్యర్థి గెలిచినట్లు ఎన్నికల అధికారి ప్రకటిస్తాడు. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం ఏ అభ్యర్థికి సగం ఓట్ల కంటే ఒక ఓటు అధికంగా రాకుంటే రెండవ ప్రాధాన్యత ఓట్లను లెక్కించడం ప్రారంభిస్తారు. ఈ ఓట్లు ఎలా లెక్కిస్తారంటే మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థిని ఓట్ల లెక్కింపు నుండి ఎలిమినేట్ చేస్తారు. ఇలా ఎలిమినేట్ చేసిన అభ్యర్థికి వచ్చిన రెండవ ప్రాధాన్యత ఓట్లను లెక్కించి మిగిలిన అభ్యర్థులకు కలుపుతారు. అప్పటికీ 50 శాతం కంటే ఒక్క ఓటు ఎక్కువ రాకుంటే మళ్ళీ తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు. ఆ అభ్యర్థికి వచ్చిన రెండవ ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థులకు కలుపుతారు. ఇలా తక్కువ ఓట్లు వచ్చిన ఒకొక్క అభ్యర్థిని ఎలిమినేట్ చేసుకొంటూవెళ్ళిఏఅభ్యర్థికి అయితే 50 శాతం కంటే ఒక్క ఓటు అధికంగా వస్తుందో అక్కడితో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిలిపివేసి గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును సైతం ఇదే పద్దతిలో చేపట్టి ఎన్నికల అధికారులు విజేతను ఖరారు చేస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం పరిధిలో మొత్తం 27,694 ఓట్లు వుండగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 24,741 ఓట్లు పోలైయ్యాయి. పోలైన ఓట్లలో సగం ఓట్లు ఆపై ఒక్క ఓటు అధికంగా సాధించిన అభ్యర్థిని అధికారులు విజేతగా ప్రకటిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ఏ ఒక్క అభ్యర్థికైనా 12,370.5ఆపైఒక్క ఓటు అధికంగా లభిస్తే ఆ అభ్యర్థి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.

## చరిత్ర పర్యాటక చిహ్నాలు ఏర్పాటు చేయండి



**రేణిగుంట, మార్చి 15 ప్రభాతవార్త:** రేణిగుంట, శ్రీకాళహస్తి, తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో రాయల సీమ చరిత్ర, పర్యాటక, పుణ్య క్షేత్రాలు గుర్తొచ్చేలా తైల వర్ణ చిత్రాలు ఏర్పాటు చేయాలని రాయలసీమ వియోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తిచేస్తూ బుధవారం ఎంపీ గురుమూర్తికి తమ సభ్యులతో కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ పరిసర ప్రాంతాల్లో ఎన్నో పుణ్యక్షేత్రాలు, మరెన్నో సహజసిద్ధ జలపాతాలు, ఇంకెన్నో పర్యాటక కేంద్రాలు, ఎన్నెన్నో ప్రఖ్యాత నదులు, రాజసం ఉట్టిపడే కోటలు ఉన్నాయన్నారు. వీటి గొప్పతనాన్ని చాటే విధంగా తైల వర్ణ చిత్రాలను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి రాయలసీమ ఖ్యాతిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ప్రయాణికులు, పర్యాటకులకు కళ్ళకు కట్టినట్లు గోడలపై తైల వర్ణ చిత్రాలు ద్వారా తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ విషయమై గుంతకల్ డివిజన్ రైల్వే మేనేజర్‌ను అభ్యర్థించగా దాతలు ముందుకు వస్తే రైల్వేస్టేషన్‌లో గోడలపై వేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. రంగుల చిత్రాలు వేయడం వల్ల నరేంద్ర మోదీ ప్రతిపాదించిన స్వచ్ఛ భారత్ మిషన్‌ను పరోక్షంగా అమలు చేయవచ్చన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలోరాయలసీమ వియోచన సమితి నాయకులు దిలీప్‌కుమార్‌రెడ్డి, హరిస్వామి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ఆగడాలకు అడ్డుకట్టవేసే రోజులు దగ్గరపడ్డాయి

శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త



స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ళలో తెలంగాణా ప్రాంతంలోని రజాకార్లు చేసిన ఆగడాలను మరిపిస్తూ, దొంగ..దొంగ.. అని అరిచినట్లు ఎంఎల్‌సి ఎన్నికలలో అన్ని అక్రమాలకు కారణమైన జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైకాపా నాయకులు దొంగ ఓట్లు అంటేనే తమకు తెలియనట్లు నటిస్తున్నారని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ రాష్ట్ర జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్ర చరిత్రలో ఏరాజకీయ పార్టీ కూడా వైసిపిలా దిగజారి వ్యవహరించలేదని ఉమేష్ ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ నియోజకవర్గపరిధిలో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ మొదలుకొని పోలింగ్ రోజు ఓటుహక్కు వినియోగించుకునే వరకు మొత్తం అక్రమంగా వ్యవహరించిన వైకాపా నాయకులు నీతులు మాట్లాడడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

## రాజ్యాధికారం ద్వారానే బిసిల సంక్షేమం

శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త

రాజ్యాధికారం ద్వారానే బిసిల సంక్షేమం, అభివృద్ధి ఉంటుందని తిరుపతి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.నాగ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సోమశే ఖర్‌లు అనానరు. ఈసందర్భంగా జరిగిన



సమావేశంలో వారు మాట్లాడుతూ 2024ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం జిల్లాలోని గ్రామస్థాయిలో సంఘం బలోపేతానికి మండల కమిటీలు గ్రామ కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. సంఘం నూత పార్టీగా ఆవిర్భవించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీకి దిగుతారన్నారు. అనంతరం శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడుగా టి.గురుసాయిని నియమిస్తూ ఉత్తర్వులు అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.జయచంద్రగౌడ్, స్థానిక బిసి కాలనీ యువత పలువురుబిసి సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

చంద్రగిరి, మార్చి 15 ప్రభాతవార్త:





మండల పరిధిలోని తొండవాడ- శానంబట్ల మార్గం ఫ్లైఓవర్ సమీపంలో బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్ర గాయాలు పాలవగా, మరొకరు స్వల్పగాయాలకు గురయ్యా రు. స్థానికుల కథనం మేరకు.. మఠంపల్లికి చెందిన వంశీ (20) వస్తుండగా తుమ్మలగుంటకు చెందిన విజయ్‌కుమార్, నాయుడుపేటకు చెందిన సాయి ఇద్దరు మరొక ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో వంశీకి ముఖంపై తీవ్రగాయాలు కాగా, విజయ్‌కుమార్, సాయి ఇద్దరిలో ఒకరి కాలు విరిగినట్లు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

## కుప్పం బాదూరు పిహెచ్‌సికి వైద్యులను నియమించండి.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి

రామచంద్రాపురం, మార్చి 15 ప్రభాతవార్త:



కుప్పం బాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులను నియమించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం కుప్పం బాదూరు పిహెచ్‌సిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం మెడికల్ ఆఫీసర్ ప్రసూతి సెలవుపై వెళ్ళడం, మరొక వైద్యుడు తొట్టంబేడు ఆరోగ్య కేంద్రానికి డిప్యుటేషన్‌పై వెళ్ళడం జరిగిందన్నారు. దీంతో ఆసుపత్రికి సూదూర ప్రాంతాల నుండి వచ్చే గర్భవతులు, వృద్ధులు, రోగులు వైద్యులు లేక తిరిగి వెళుతున్నట్లు తెలిపారు. గతంలో వందకు పైగా వున్న ఓపి ప్రస్తుతం 10-20కి పడిపోయినట్లు తెలిపారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలన్నారు.

## కల్యాణ వెంకన్నకు పరదాలు వితరణ

మొక్కు తీర్చుకున్న రెడ్డివారిపల్లి సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి

చంద్రగిరి, మార్చి 15 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసి యున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి రెడ్డివారిపల్లి సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి పరదాలు వితరణ చేశారు. పంచాయతీ సర్పంచ్‌గా విశిష్ట సేవలందిస్తున్న సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి దంపతులు స్వామి వారి పట్ల భక్తివిశ్వాసాలతో రూ.34,000/-లు విలువైన పరదాలు తయారు చేయించారు. బుధవారం ఆలయానికి చేరుకుని ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామికి అందజేశారు. అనంతరం వీరికి ఆలయ సిబ్బంది స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జిత ఇన్స్పెక్టర్ ధనశేఖర్, విజిలెన్స్ కేశవ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధుడు ఆత్మహత్య...?

రేణిగుంట, మార్చి 15 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం అన్నసంపల్లికి వెళ్లే మార్గంలో వేప చెట్టుకు సుమారు 50 నుంచి 55 మధ్య వయసు కలిగిన వృద్ధుడు లుంగీతో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.... రేణిగుంట నుంచి అన్నాసంపల్లికి వెళ్లే మార్గంలో వేప చెట్టుకు ఓ వృద్ధుడు లుంగీతో ఉరి వేసుకుని వేలాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకి దింపి శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఏర్పేడు నుంచి రేణిగుంటకు ప్రయాణించినట్లు ఆర్టీసీ బస్సు టికెట్ మాత్రమే దొరికింది. అర్బన్ పోలీసులు సీఐ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వినియోగదారుల హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోండి!

-కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డా॥పి.సి.రాయలు




తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 15 ప్రభాతవార్త: మన దేశంలోని ప్రతి పౌరుడు వినియోగదారుడేనని,రాజ్యాంగం కల్పించిన ప్రకారం వారికి కొన్ని హక్కులు ఉంటాయని,కావున వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కన్స్యూమర్స్ రైట్స్ ఆర్గనైజేషన్ సౌత్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ మెంబర్ మరియు కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డా॥పి.సి.రాయలు పిలుపునిచ్చారు.బుధవారం కన్స్యూమర్స్ ఇంటర్నేషనల్ కన్స్యూమర్స్ డే సందర్భంగా ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కన్స్యూమర్స్ రైట్స్ వారు కన్స్యూమర్స్(వినియోగదారులు) రైట్స్ పైన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు,జార్ఖండ్ బీజేపి అధ్యక్షుడు దీపక్ ప్రకాష్,మరో రాజ్యసభ సభ్యుడు డి.ఎల్.ఎన్.వి.రావులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాపిసి.రాయలు మాట్లాడుతూ వినియోగదారులు నిత్యం కొనుగోలు చేసే పాల ప్యాకెట్ నుండి పెట్రోల్,డీజిల్ వరకు నాణ్యతలో అలాగే కొలత,తూకంలో ఎలాంటి మోసాలు ఉన్నా,తక్షణం వినియోగదారుల కోర్టుల ద్వారా తమ హక్కులను ఉపయోగించుకుని తగిన న్యాయం పొందవచ్చని సూచించారు.ఈ సమావేశంలో సిఆర్ఓ బృందం,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దొంగ ఓట్లు వేయలేదని దక్షిణామూర్తి వద్ద ప్రమాణానికి సిద్ధమా!

-దేశం నాయకులు ఛాలెంజ్

తొట్టంబేడు, మార్చి 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకర్గంలో దొంగ ఓట్లే వేయలేదన్న ఓవైకాపా నాయకుడు దక్షిణామూర్తి వద్ద ప్రమాణం చేస్తారా? అంటూ తెలుగుదేశం ఛాలెంజ్ విసిరింది. ఈనెల 13న జరిగిన ఎంఎల్‌సి, పట్టభద్రులు ఎన్నికల్లో దొంగ ఓట్లే నమోదు కాలేదని, తెలుగుదేశంనాయకుడికి తెలివిలేదని అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పడాన్ని తప్పుబడుతూ బుధవారం దేశం నాయకులు సమావేశం నిర్వహించారు. అయితే సమర్థించుకున్న వైకాపా నాయకుల్లో ఒకరు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పినవారైతే మరొకరు విద్యాసంస్థలను నిర్వహిస్తున్నవారు కావడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలుగుదేశంపార్టీ నేతలు మాట్లాడారు. ఈసందర్భంగా తిరుపతి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షులు సుబ్బయ్య మాట్లాడుతూ నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిపై వైకాపా నాయకులు అసత్యఆరోపణలు చేయడం తగదన్నారు. సుధీర్‌రెడ్డి ఎన్నడూ రౌడీయుజం చేసేవారు కాదని వివాదాలకు నిలయంగా వైకాపానే తప్ప ఎన్నడూ తెదేపా లేదన్నారు. తండ్రిని అడ్డం పెట్టుకుని ఎంఎల్‌ఏ తనయ బియ్యపుపవిత్రారెడ్డి, కుమారుడు ఆకర్ష్‌రెడ్డిలు పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎస్‌డికె నగర్ నుంచి రాజీవ్‌నగర్‌వరకు అన్నీ ఆక్రమణలే అని విమర్శించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద రౌడీయుజం చేసింది కారు అద్దాలను ధ్వంసం చేసింది వైకాపా నాయకులే అన్నారు. మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన శాసనమండలి, పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి నేతలు విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేయించారని ఆరోపించారు. కాసరం రమేష్ మాట్లాడుతూ జిల్లా పరిషత్‌బాలికోన్నత పాఠశాలలో బూత్‌నంబర్ 240కు తాను ఏజెంట్‌గా వ్యవహరించానని ఇక్కడకి ఏఅధికారంతో పోలింగ్‌బూత్‌లోకి ప్రవేశించారని ప్రశ్నించారు. విద్యావంతుడైన ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, ఓ ప్రైవేటు విద్యాసంస్థ నడుపుతున్న మిద్దెలహరిలు పోలింగ్‌బూత్‌లోకి ఎలా వెళ్తారని దీనిపై తాను అర్బన్ సిఐ, అక్కడే విధుల్లో ఉన్న రూరల్ ఎస్‌ఐకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. రేణిగుంట మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకం పెరిగిపోతోందని ప్రశ్నించేవారిపై కేసులు పెట్టడం అధికారపార్టీకి పోలీసులు దాసోహంగా మారారని తెలిపారు. వైసిపి నాయకులు దొంగ ఓట్లు వేయించారని ప్రమాణం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని అది వైకాపా కార్యాలయమైనా, లేదా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని దక్షిణామూర్తి వద్దనైనా సరే అని సవాల్ విసిరారు. ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు. సమావేశంలో తెదేపా పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం, గోపి, మాజీ జడ్పీటిసి మునిరంగారెడ్డి పలువురు తెలుగుదేశంపార్టీనాయకులు పాల్గొన్నారు.

## పన్నుల చెల్లించకుంటే ప్రాసిక్యూషన్‌నోటీసులు

మున్సిపల్ కమిషనర్



శ్రీకాళహస్తి,మార్చి 15 ప్రభాతవార్త

మార్చి మాసం వస్తుందంటే పన్నుల చెల్లింపు దారుల్లోదడ. మున్సిపల్ అధికారులకు పరుగు పందెం. మున్సిపల్‌శాఖ టార్గెట్లు విధించి పన్నులవసూళ్ళకు ఆదేశిస్తారు.ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న అధికారులు సిబ్బందిని పరుగులు తీయిస్తారు.సాధారణంగా మార్చి చివరివారంలో పన్నుల వసూళ్ళకు అధికారులు,సిబ్బందివత్తిడితెచ్చే వారు.అయితే ఈ ఏడాదిమార్చి నెలప్రారంభం నుంచే పన్నుల వసూళ్ళకు అధికారులు సిబ్బందిని పరుగులు తీయిస్తున్నారు.అంతేకాదు ప్రస్తుతం సచివాలయ సిబ్బంది వార్డుల్లోని వాలంటీర్లను కూడా పన్నుల వసూళ్ళకు నియమించారు. దాంతో పన్నుల చెల్లింపు దారులు, బకాయి దారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఓ వైపు ఇంటి పన్నులు ,మరో వైపు నీటి పన్ను, ఇంకొక వైపు మున్సిపల్ దుకాణాలను లీజుకు తీసుకొని చెల్లించని వారి నుంచి వసూళ్ళకు పరుగులు తీస్తున్నారు.

**ఇంటి కొళాయిలు తొలగింపు:**

శ్రీకాళహస్తి మున్సిపల్ పన్నుల డిమాండ్ రూ.6కోట్లు. ఈ పన్నులను నూరు శాతం వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తుంది.ఈ నేపథ్యంలో అధికారులు సిబ్బంది పరుగులు తీస్తున్నారు.బుధవారం కొన్ని ప్రాంతాల్లో దీర్ఘకాలంగా నీటి పన్నులు చెల్లించని వారి ఇళ్ళకొళాయి కనెక్షన్లను తొలగించారు.అలాగే తేరువీధిలోని ఓ హోటల్ దీర్ఘకాలంగా పన్నులు చెల్లించక పోవటంతో బీగాలు తగిలించారు. కఠిన చర్యలతో పన్నుల వసూళ్ళకు సమాయత్తమయ్యారు. ఓ వైపు బిల్ కలెక్టర్లు ప్రత్యేక సిబ్బందిని గ్రూపులుగా విభజించి ఇంటింటికి పంపుతున్నారు.అలాగే పన్నులు సకాలంలో చెల్లించక పోతే 'మున్సిపల్ చట్ట పరిధిలో ప్రాసిక్యూషన్'నోటీసులు జారి చేస్తామని కూడా కమిషనర్ బాలాజి నాయక్ వివరించారు.

## భార్యభర్తల మధ్య పంచాయతీలో గొడవ

పలువురికి గాయాలు

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 15 ప్రభాతవార్త

భార్యభర్తల మధ్యలో ఏర్పడ్డ గొడవ చిలికి చిలికి గాలివానైంది. ఈ గొడవ మధ్య పంచాయతీ చేయటానికి వెళ్ళిన పెద్దల సమక్షంలో గొడవలుచోటు చేసుకొని దాడులు జరుపుకున్నారు. రూరల్ సిఐ అజయ్‌కుమార్ అందించిన సమాచారం మేరకు ఎంపేడు పరిధిలోని భార్యభర్తలు శివమణి,జయలక్ష్మీల మధ్య ప్రసవ ఖర్చులకు సంబంధించి వివాదాలు చోటు చేసుకున్నాయి. ప్రసవానికి సంబంధించిన ఖర్చులు పుట్టింటివాళ్ళు భరించాలన్నది.శివమణి వాదన దాంతో భార్యభర్తల మధ్య గొడవ ప్రారంభవమైంది. ఈ నేపథ్యంలో పంచాయతీ చేయటానికి మనోహర్,మధులు వెళ్ళారు. పంచాయతీలో మాటా మాట పెరిగింది. ఘర్షణ చోటు చేసుకుంది. పలువురు గాయపడి ఆసుపత్రి పాలైనట్లు సిఐ అజయ్‌కుమార్ వివరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వెలంపాడు జాతరలో బియ్యపు పవిత్ర

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం వెలం పాడు గ్రామంలో జరుగుతున్న జాతరకు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి హాజరై పూజలు జరుపుకున్నారు. వేసవి కాలం మొదలైతే గ్రామాల్లో పొంగళ్ళు, పాండురంగ స్వామి తిరునాళ్ళు, జాతరలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో వెలంపాడు గ్రామంలో పోలేరమ్మ జాతర మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగాప్రారంభమైంది. బుధవారం ఉదయం నుంచి గ్రామంలోనూ, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్నారు.ఈ నేపథ్యంలో పవిత్రారెడ్డి విచ్చేసి పూజలు జరుపుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను పెంచుల్‌రెడ్డి, రఘునాయుడు, మనోహర్‌రెడ్డి, అనంత్, శివ, విజయ్‌కుమార్, చంద్రప్రసాద్‌రెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్స్పైర్ పోటీలకు కాళహస్తి మండల విద్యార్థి

శ్రీకాళహస్తి రూరల్, మార్చి 15 ప్రభాతవార్త



రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు శ్రీకాళహస్తి మండలం ఓబాళాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సి.విష్ణుప్రసన్న ఎంపికైనట్లు పాఠశాల ప్రధానానోపాధ్యాయులు ఏ.బాలయ్యబుధవారం తెలిపారు.ఈ విద్యార్థి ఈ విద్యార్థి ఈ నెల 9,10 తేదుల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా స్థాయి ఇన్స్పైర్ ప్రాజెక్టులపై ఆన్‌లైన్లో నిర్వహించారు. విద్యార్థిని సి.విష్ణుప్రసన్న 'ఎకోకూలర్' ప్రాజెక్టును రూపొందించి సమర్పించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా కమిటి ప్రకటించింది.ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో అభినందన సభను నిర్వహించారు.ఎంపికైన విద్యార్థినిని సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో సైన్సుఉపాధ్యాయులు తిలక్‌కుమార్‌బాషా,ప్రధానోపాధ్యాయులు బాలయ్య గ్రామస్థులు సత్కరించారు.

## ఎస్వీయు విసిని రీకాల్ చేయాలి

శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త



గడచిన ఆరు దశాబ్దాల కాలంలో ఎంతోమంది విద్యావేత్తల అద్వితీయమైన కృషి ఫలితంగా సాధించుకున్న కీర్తి ప్రతిష్టలను కాపాడడంలో విఫలమైన శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజారెడ్డిని రీకాల్ చేయాలని పురపాలక సంఘం 18వ వార్డు మాజీ కౌన్సిలర్ డాక్టర్ నివేదితమోరే రాష్ట్ర గవర్నర్‌ను డిమాండ్ చేశారు. యుజిసి నిబంధనల ప్రకారం సుమారు ఆరువందలమంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండవలసి ఉండగా, కేవలం 160 మంది మాత్రమే ఉండడాన్ని గుర్తించిన నాక్ బృందం యూనివర్సిటీ తీరును ఎండగడుతూ గతంలో ఉన్న గ్రేడ్‌ను తగ్గిస్తూ నివేదిక పంపడం చాలా బాధాకరమన్నారు. అధ్యాపక నియామకాలు చేపట్టకుండా బోధనా ప్రమాణాలను దిగజార్చి, రాజకీయ నాయకుల భజనతో తమ పబ్బం గడుపుకునే అసమర్థ పాలకుల కారణంగానే యూనివర్సిటీ ప్రాంగణంలో కులాల కుంపలి రాజేసి తమ పెత్తందారికి అడ్డులేకుండా చూసుకుంటూ విశ్వవిద్యాలయాల ప్రగతిని పక్కన పెట్టేశారని నివేదితమోరే ఆరోపించారు. ఎస్వీయుకు ఉన్న అత్యున్నత గుర్తింపును తీసుకురావడంలో విఫలమైన ఎస్వీయు ఉపకులపతి మరియు ఇతర అధికారులను తక్షణమే తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ప్రభాకర్ మృతికి గాలి జగదీష్ నివాళి

నగరి, మార్చి 15 ప్రభాతవార్త:

నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడ దళితవాడకు చెందిన ప్రభాకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు ట్రస్టు అధినేత గాలి జగదీష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# తిరుపతి డివిజన్

## సెట్విన్, జిల్లా వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

తిరుపతి (క్రీడ), మార్చి 15, ప్రభాతవార్త



ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం సెట్విన్ యువజన సర్వీస్ శాఖ తిరుపతి జిల్లా, డిస్ట్రిక్ట్ కన్స్యూమర్స్ కౌన్సిల్ వారి సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారుడు తన అవసరం కోసం తీసుకునే వస్తువులు తగు జాగ్రత్తలు ఐఎస్ఐ మార్కు, ఎమ్మార్పీ రేటు, వస్తువు నైపుణ్యం గుర్తించి తీసుకోవాలని తర్వాత ఉత్పత్తిదారుడు వస్తువు యొక్క నాణ్యతను ప్రమాణంలో తగ్గుదల ఉన్నట్లయితే అది ఉపయోగకరంగా లేనట్లయితే జాతీయ కన్స్యూమర్ కౌన్సిలింగ్ హెల్ప్ నెంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని. అట్లు లేనట్లయితే డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కౌన్సిల్ కి ఫిర్యాదు చేసుకోవచ్చని కోరారు. డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్య సమితి స్వచ్ఛమైన ఇంధన పరిరక్షణ ద్వారా నియోదారులకు సాధికారిక కల్పించడం అనే కాన్సెప్ట్‌తో ప్రజలకు వినియోగదారునికి ప్రకృతి సహజ వనరులు కాపాడుకోవాలని తెలియజేసారు. సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి ఒక వినియోగదారుడని ఏ వస్తువునైనా కొనుగోలు చేయవల్సిన అవసరం ఏర్పడుతుందని తగు జాగ్రత్తతో క్వాలిటీతో కూడిన వస్తువులను గుర్తించి తీసుకోవాలని వస్తువు యొక్క క్వాలిటీ లేనప్పుడు ప్రభుత్వం కల్పిస్తున్న జాతీయ వినియోగదార పోరమును సద్వినియోగం చేసుకోవాలని పై తెలిపిన టోల్ ఫ్రీ నెంబరును అవసరమైన, యువత, వినియోగదారుడు ఉపయోగించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిఎస్ఓ ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శి డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కౌన్సిల్ తిరుపతి, చిత్తూరు జిల్లా రాజారెడ్డి, ఇన్స్పెక్టర్ లీగల్ మెటాలజీ డిపార్ట్మెంట్ మల్లేష్ రావు సెట్విన్ సిఈఓ డా. మురళికృష్ణ, ఎస్‌పిడబ్ల్యూ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ స్వరాజలక్ష్మి, శ్రీ పద్మావతి డిగ్రీ కాలేజ్ లెక్చరర్ అరుణకుమారి, ఫుడ్ ఇన్స్పెక్టర్, యువతీ యువకులు, ఎన్జీవోస్, వినియోగదారులు, సిబ్బంది, యువజన సంఘాలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జరిగిన ఇంటర్ పరీక్ష

నగరి, మార్చి 15 ప్రభాతవార్త:

ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. బుధవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్ష తెలుగు, సాన్ స్క్రిట్ 981 మంది విద్యార్థులకు గాను 957 మంది విద్యార్థులు హాజరయ్యారు. గురువారం నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానుంది. ప్రిన్సిపాళ్లు వెంకటాచలపతి, వెంకటరమణాచార్యులు పరీక్షా కేంద్రాల్లో పూర్తి భద్రతను ఏర్పరచారు. స్పెషల్ స్క్వాడ్, పోలీసులు కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

## వైభవంగా కాలభైరవాష్టమి పూజలు

నగరి, మార్చి 15 ప్రభాతవార్త:

పట్టణ పరిధిలో కరకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కాళభైరవ అష్టమి పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని కాళభైరవ సన్నిధిలో సహస్రనామావళి అష్టోత్తర నామావళి పూజలు నిర్వహించారు. అనంతరం కాళభైరవ స్వామికి అభిషేక పూజలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలందుకున్నారు. ఉభయదారులకు ఆలయ నిర్వాహకులు సంకల్ప పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం, ప్రధాన అర్చకులు దుర్గాప్రకాష్, నవీన్‌కుమార్ ఆచార్యులు, విజయకుమార్, సురేష్‌కుమార్, స్థానిక ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

## అన్నార్తుల కడుపులు నింపుదాం

- యువనేస్తం మునిశేఖర్

రేణిగుంట, మార్చి 15 ప్రభాతవార్త:



ఎంతో మంది నిర్భాగ్యులు కడుపునిండా తిండి తినలేక అలమటించి పోతున్నారని వారి ఆకలి బాధను తీర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందని యువ నేస్తం చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ మునిశేఖర్, ట్రస్టు అధ్యక్షుడు వినోద్ పిలుపునిచ్చారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని అక్షయ క్షేత్రంలో బుధవారం 60 మంది ప్రత్యేక అవసర ప్రతిభావంతులకు ఏర్పేడు మండలం సరస్వతి కండ్రికి చెందిన నాగేంద్రబాబు, స్వప్నల కుమార్తె హేమంషి సందర్భంగా యువ నేస్తం ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిశేఖర్, వినోద్ సంయుక్తంగా మాట్లాడుతూ ఎంతో మంది అన్నార్తులు కడుపులు నిండక బాధలు పడుతున్నారన్నారు. వారి ఆకలి బాధలు తీర్చడానికి యువ నేస్తం సిద్ధంగా ఉందన్నారు. దాతలు ముందుకొచ్చి సాయం చేస్తే స్వచ్ఛందంగా సేవ చేయడానికి యువ నేస్తం సభ్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. అభాగ్యుల ఆకలి బాధలు తీర్చిన హిమంషికి నాగరాజు, కనకమ్మ, నగేష్, వెంకటేష్, సంజీవరెడ్డి, తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

## దళిత బహుజనుల సమస్యలను పరిష్కరించండి

- అంబేద్కర్ స్టార్ కృష్ణ



**రేణిగుంట, మార్చి 15 ప్రభాతవార్త:** దళిత బహుజనుల సమస్యలను పరిష్కరించాలని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ పలువురు మంత్రులకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఆయన మంత్రులు విశ్వరూప్, మేరుగు నాగార్జున, ఆర్.కె.రోజాలను కలసి పూలమాలలు వేసి శాలువలు కప్పి సత్కరించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల కోసం కృషి చేసిన మంత్రి విశ్వరూప్‌ను పొగడతలతో ముంచెత్తారు. ఎస్సీ కమిషన్ ఆఫీసులో చైర్మన్ విక్టరీ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే అందజేశారు. దళితుల సమస్యల పరిష్కారం పట్ల ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. కలసిన వారిలో ఎస్వీసెనేట్ మెంబరు మల్లారావు, మధు, వెంకటేష్, హరి నాయక్ తదితరులు ఉన్నారు.

## వాణిజ్య సముదాయంతో కార్పొరేషన్‌కి ఆదాయం

కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, మార్చి 15, ప్రభాతవార్త



తిరుపతి కపిలతీర్థం నంది సర్కిల్ వద్ద నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాల భవనాన్ని బుధవారం తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండి అనుపమ అంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ మాట్లాడుతూ మరో నెలలోపు ఈ వాణిజ్య సముదాయ భవనాన్ని పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతుందన్నారు. రెండు కోట్ల రూపాయాల వ్యయంతో పది వేల చదరపు అడగుల విస్తీర్ణంలో మూడు అంతస్థుల భవనాన్ని నిర్మించి నగర పాలక సంస్థకు ఆదాయం వచ్చేలా అద్దెకివ్వడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కి ఆదాయ వనరులు పెంచేందుకు మరిన్ని వాణిజ్య సముదాయాల రూపకల్పనకు ప్రయత్నిస్తున్నట్లు ఆమె తెలిపారు. తుది దశ నిర్మాణంలో వున్న భవనపు పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

## సాహిత్యనిధిని పంచిన ఆధ్యాత్మిక వేత్త

ప్రవచనకర్త సముద్రాల లక్ష్మణయ్యకు సంతాపం

తిరుపతి(క్రీడ),మార్చి15ప్రభాతవార్త:



మహామహోపధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య మృతి ఆధ్యాత్మికవేత్తలకు, ప్రవచనకర్తలకు, పండితులకు తీరని లోటని రాయలసీమ రంగస్థలి సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి అన్నారు. నేటి యువ రచయితలకు కవులకు అవధానాలకు దిక్సూచి సముద్రాల లక్ష్మణయ్య అన్నారు. టిటిడి ధర్మప్రచారపరిషత్ అధ్యక్షుడుగా, పురాణ ప్రాజెక్టుద్వారా ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలకు వ్యాఖ్యానం రాశారన్నారు. సముద్రాల లక్ష్మణయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు డాక్టర్ మేడసాని మోహన్, గుండాల గోపీనాథరెడ్డి నివాళులర్పించారు. ఆయన కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

## టిటిడి ఇఒను కలసిన ఏపి ఉద్యోగసంఘాల నాయకులు

తిరుపతి(క్రీడ),మార్చి15ప్రభాతవార్త:



ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ నాయకులు బుధవారం తిరుపతి లో టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశా రు. ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనంజయనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేష్ బాబు, కార్యదర్శి జి.బాలాజీ, టిటిడి ఉద్యోగసంఘాల నాయ కుడు చీర్లకిరణ్ కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



## ప్రభాకర్ మృతునికి గాలి జగదీష్ నివాళి

నగరి, మార్చి 15 ప్రభాతవార్త:

నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడ దళితవాడకు చెందిన ప్రభాకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు గాలి జగదీష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# వైభవంగా పేట గంగమ్మ జాతర

## అద్భుతంగా అలంకారం





విశేష అలంకరణలో నల్లగంగమ్మ అమ్మవారు మూలవిరాట్టు, సప్పరంలో కొలువుదీరిన నల్లగంగమ్మ,, అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న శ్రీకాళహస్తీశ్వరాయల చైర్మన్, సభ్యులు

శ్రీకాళహస్తి, మార్చి 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నాలుగు సార్లు జాతర్లను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బుధవారం బహాదూరుపేట నల్లగంగమ్మ జాతర కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి అలంకారం అద్భుతం అత్యద్భుతంగా ఆకట్టుకుంది. చలి కాలంలో ఏడు గంగమ్మల జాతర, తిరుపతి గంగమ్మ జాతరతో పాటు అగ్రహారం జాతర, తరువాత వేసవి కాలంలో పానగల్ జాతర, అలాగే బహాదూరుపేట జాతరను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బహాదూరుపేటలోని నల్లగంగమ్మ జాతరను యువకులు నిర్వహించారు.

**గ్రామోత్సవం:**

శ్రీకాళహస్తి పట్టణంలోని బహాదూరుపేటలోని నల్లగంగమ్మ ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జాతరకు ఎనలేని స్పందన ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. సుమారు 2కిలో మీటర్ల మేర విద్యుత్ దీపాల దేవుళ్ళు, విద్యుత్ దీపాల తోరణాలతో ముస్తాబు చేసారు. అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారికి బలి ఇచ్చి గ్రామోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవం ఉదయం 9గంటల వరకు సాగి తరువాత స్థావరం వద్ద ప్రతిష్టించారు. అక్కడ నుంచి బహాదూరుపేట చుట్టుపక్కల నుంచే కాకుండా పట్టణంలోని పలు ప్రాంతాలతకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా జంతుబలులు చోటు చేసుకుంది. ఇంటింటికి పొట్టేళ్ళు, కోళ్ళను బలి ఇచ్చారు. పలువురు అమ్మవారి స్థావరం వద్ద వేయికళ్ళదుత్తలతో మొక్కులుతీర్చుకున్నారు. చూసినప్రతి ఒక్కరు అలంకారంఅత్యద్భుతమని ప్రసంశించారు.

**సారె బహూకరణ**

బహాదూరుపేట గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో దేవస్థానం తరుపున నల్లగంగమ్మకు సారెను అందించారు. స్థానిక సంప్రదాయంమేరకు సారెను అందించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, వేదపండితులు వశిష్టశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, పసల సుమతి, రమాప్రభ, లక్ష్మీ, ఆలయాధికారులు ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, దఫేదార్ దాము, సుదర్శనం రెడ్డి, నాగరాజులు పాల్గొని సారెను నల్లగంగమ్మ కమిటి చైర్మెన్ కంఠా రమేష్‌కుఅందజేసారు. ఈ కార్యక్రమాల్లోకంటా రమేష్, పూలకృష్ణమూర్తి, మందలరామమూర్తి, రాజేంద్ర, నారాయణ, ప్రదీప్, అనిల్, దిలీప్, యాదగిరి, కపిల్, సుబ్రమణ్యం గ్రామ పెద్దలు స్వర్ణమూర్తి, కొట్టే అనిల్ నరేష్, కొట్టే సత్యనారాయణ, పత్తిమణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురునాధస్వామి గ్రామోత్సవం



చిల్లకూరు మార్చి 15 ప్రభాతవార్త

తూర్పు కనుపూరు గ్రామంలో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో రెండోరోజు బుదవారం సాయింత్రం యారా గురునాధస్వామి, అంకమ్మ సిద్దలయ్య, పరుశరాముడు, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గొల్లలు గంగపెట్టి ఎత్తుకొని వీరతాళ్ళు వేసుకుంటు తప్పెట్లు తాళాల నడుమ కనుపూరు వీదులలో గ్రామోత్సవం నిర్వహించారు. డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి ఆద్వర్యంలో సిఐ దశరదరామారావు ,ఎస్‌ఐ బి గోపాల్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. జాతరకి అధిక సంఖ్యలో బుధవారం సాయింత్రానికి రావడం జరిగింది. భక్తులకు ఎక్కడ అవాంచనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

## వినాయకసాగర్ పనులు వేగవంతం చేయాలి

### కమిషనర్ అనుపమ అంజలి



తిరుపతి కార్పొరేషన్, మార్చి 15, ప్రభాతవార్త

తిరుపతి నగరానికి వన్నె తెచ్చేలా ఏర్పాటు చేస్తున్న వినాయకాసాగర్ పనులను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్ సిటి ప్రాజెక్టు ఎండి అనుపమ అంజలి అధికారులకు సూచించారు. వినాయక సాగర్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ అనుపమ బుధవారం ఇంజనిరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక సాగర్ చుట్టూ ప్రజలను ఆకట్టుకునేలా అందంగా తయారు చేయాలన్నారు. ఫేస్ వన్ స్థాయి పనులను వచ్చే నెలలోపు పూర్తి చేసేలా అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. వినాయకసాగర్ మధ్యలో ఏర్పాటు అవుతున్న డివైడర్లలో అందమైన చెట్లు వుండాలని, చుట్టూ పచ్చని గడ్డి లాన్ ఏర్పాటు చేయాలని, వాకింగ్ ట్రాక్ సిద్ధం చేయాలని, చిన్న పిల్లలకు పార్క్, స్విమ్మింగ్ పూల్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అనుపమ అంజలి సూచించారు. అనంతరం అక్కారంపల్లె మాస్టర్ ప్లాన్ రోడ్ నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశాల జారీ చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునిత, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈలు విజయకుమార్‌రెడ్డి, సంజీవ్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

## ఎవరెవరికి ఎమ్మెల్సీల కిరీటం

**- సిట్టింగ్ స్థానాలు మావేనని పిడిఎఫ్ ధీమా!**

**- విజయం తమదేనని వైకాపా అంచనా**

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:

కొన్ని గంటల వ్యవధిలో ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండటంతో ఈ ఎన్నికల్లో ఎవరెవరు గెలుస్తారనే విషయమై అందరిలో ఉత్కంఠత నెలకొంది. ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 8 మంది అభ్యర్థులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 22 మంది అభ్యర్థులు పోటీ పట్టారు. ఇప్పటి వరకు శాసనమండలికి మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలను ఏకపక్షంగా పిడిఎఫ్ అభ్యర్థులు కైవసం చేసుకొని రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో వున్న పార్టీలకు చుక్కలు చూపించాయి. ప్రస్తుతం శాసనమండలికి నాల్గవసారి జరిగి ఎన్నికల్లో సైతం పిడిఎఫ్ అభ్యర్థులు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడానికి మెజార్టీ ఉపాధ్యాయ సంఘాలు సర్వశక్తులు ఒడ్డాయి. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎలాగైనా ఈ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవాలని నిర్ణయించి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానానికి అభ్యర్థులను ఖరారు చేసి క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులను విజయం కోసం వైకాపా అధిష్టానం రంగంలోకి దించింది. క్షేత్ర స్థాయిలో వైకాపా శ్రేణులు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పార్టీ అభ్యర్థుల విజయం కోసం సర్వశక్తులు ఒడ్డి కృషి చేయడంతో అప్పటి వరకు గెలుపుపై ధీమాగా వున్న పిడిఎఫ్ అభ్యర్థులకు చెమటలు పట్టడం ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో విజయం ఎవరికి లభిస్తుందనే విషయంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

## తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

### -అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు



తొట్టంబేడు, మార్చి 15 ప్రభాతవార్త

తొలిరోజు ఇంటర్ పరీక్షలు పట్టణంలో ప్రశాంతంగా నిర్వహించారు. పట్టణంలో ఇంటర్ మీడియట్ పరీక్షా కేంద్రాలుగా ఎస్వీపి బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఎంజిఎం కళాశాల, విక్రమ్ జూనియర్ కళాశాల, కాసాగార్డెన్‌లోని గురుకుల పాఠశాలలను నిర్ణయించారు. మొత్తం 2300మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. పరీక్ష ఉదయం 9 నుంచి మద్యాహ్నం 12గంటల వరకు నిర్వహించాల్సి ఉండగా తొలిరోజు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో 8గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకార్యర్థం తాగునీరు, దస్కులసౌకర్యం, విద్యుత్ కల్పించడంతోపాటు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద సిసి కెమెరాలతో పాటు జీపిఎస్ ట్రాకింగ్‌ను ఏర్పాటుచేశారు. ప్రతి ఏడాదిలాగే జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకార్యార్థం మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. విద్యార్థుల హాజరు 60శాతం ఉన్న వారికి కూడా ప్రభుత్వ నిబంధనలు అనుగుణంగా అదనపు రుసుము చెల్లించడం ద్వారా హాల్‌టిక్కెట్లు మంజూరు చేసినట్లు కళాశాల యాజమాన్యాలు వివరించాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8గంటలకంతా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సమయం మించి హాజరయ్యేవారిని అనుమతించే ప్రసక్తిలేదన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నేటి నుంచి ప్రారంభంకాగా, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రేపటి నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు సుమారు 2300 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలైన ఎస్వీపి బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఎంజిఎం కళాశాలలో పరీక్షల నిర్వహణతీరును టుటౌన్ సిఐ భాస్కర్‌నాయక్ పరిశీలించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును నిర్వహించారు.

## చంద్రగిరిలో పేట్రేగిపోతున్న రౌడీమూకలు

### వసతి గృహ విద్యార్థులపై భౌతిక దాడులు





చంద్రగిరి, మార్చి 15 ప్రభాతవార్త:

చారిత్రత్మక చంద్రగిరిలో నానాటికీ రౌడీమూకలు మరీ పేట్రేగిపోతుండంతో ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోతున్నాయి. మంగళవారం రాత్రి చంద్రగిరిలోని ఓ ప్రభుత్వ వసతి గృహంలో సీనియర్, జూనియర్ విద్యార్థుల నడుమ తలెత్తిన వివాదంతో జూనియర్ విద్యార్థి చంద్రగిరిలోని రౌడీమూకలను వసతి గృహంలోని విద్యార్థులపైకి పురిగొల్పిన దాడిలో రాఘవేంద్ర అనే విద్యార్థి తలకు బలమైన గాయం అయ్యింది. హాకీ స్టిక్స్, రాడ్స్‌తో తమపై దాడిచేసినట్లు విద్యార్థులు వాపోతుండటం గమనార్హం. చంద్రగిరి గత కొన్నేళ్ళుగా గంజాయి, అల్లరిమూకల రౌడీయిజం, వర్గ విభేధాలతో హత్యాయత్నాలు వంటి సంఘటనలు షరామామూలు అయ్యాయి. వసతి గృహ విద్యార్థులను సైతం మద్యానికి బానిసలుగా మార్చడం, తరచూ డబ్బుల కోసం వారిని కొట్టడం వంటి ఘటనలు సర్వసాధారణమయ్యాయి. ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరుగా వున్న చంద్రగిరిలో ప్రస్తుతం కొంత మంది రౌడీలుగా చెలామణీ అవుతూ పోలీసులకే సవాల్ విసిరే స్థాయికి చేరుకున్నారు. హాస్టల్లో జరిగిన దాడులను వీడియో చిత్రీకరించిన మొబైల్ ఫోన్‌ను లాక్కుని డిలిట్ చేయడంతో పాటు హెచ్చరించడంతో మిన్నకుండిపోయారు. దశాబ్ద కాలం క్రితం వరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకునే పోలీసు వ్యవస్థ గత కొన్నేళ్ళుగా చేతలుడిగి చూస్తుండటం పట్ల బాధితులు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఇదేమని ప్రశ్నించేందుకు సైతం ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ ఎగ్జామ్స్ జరుగుతుండటంతో విద్యార్థులు తమపై దాడులు జరుగుతాయనే భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.

### అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు

# ప్రత్యేక చర్యలు

**-సోషియల్ మీడియాల ద్వారా దారి మల్లుతున్న యువత**

**-నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాల ఏర్పాటు**

**-పలమనేరు డిఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన -డిఐజి రవిప్రకాష్**



పలమనేరు, మార్చి 15, ప్రభాతవార్త:

అసాంఘీక కార్యక్రమాలు, నేరాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డిఐజి రవిప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక డిఎస్పీ కార్యాలయాన్ని డిఐజి రవిప్రకాష్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డిఎస్పీ కార్యాలయ పరిధిలోని కేసులు, నేరాల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత నానాటికి పెరుగుతున్న తరుణంలో ఆన్‌లైన్ మోసాలు, నేరాలు అధికమౌతున్నాయని తెలిపారు. పోక్సో కేసుల నమోదు అధికంగా ఉన్న క్రమంలో వాటి నియంత్రనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 14 నుండి 18 సంవత్సరాలు ఉన్న యువత అధికంగా ఆన్‌లైన్‌లు, సోషియల్ మీడియాల ద్వారా తప్పుదు మార్గాలకు వెళుతున్నారని పిల్లలు ఆన్‌లైన్‌లో ఎటుంటి విషయాలను గమనిస్తున్నారన్న విషయాలను తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. కర్నాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతంగా ఉన్న పలమనేరు పరిధిలో అధికంగా గంజాయి అక్రమ రవాణా జరుగుతునట్లు సమాచరం ఉందని ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టడం జరిగిందని తెలిపారు. అక్రమ మద్యం తరలింపుపై ఇప్పటికే తమ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి కర్నాటక నుండి అక్రమ మద్యాన్ని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి నియంత్రించారన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం:

నానాటికి ఆన్‌లైన్ మోసాల పెరిగిపోతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్‌ల ద్వారా కొత్త వ్యక్తులతో పరిచయాలు అనేక సమస్యలకు దారితీసుందన్నారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని బ్యాంకుల నుండి ఫోన్ చేస్తున్నామని ఎటిఎం నెంబర్‌ను తెలపాలని వచ్చే ఫోన్‌లను స్పందించవద్దని తెలిపారు. బ్యాంకు ఖాతపై ఎవైన సమాచారం కావాలంటే బ్యాంకులను సంప్రదించాలని తెలిపారు. సోషియల్ మీడియాల ద్వారా పరిచయాలు అనర్థలకు దారితీస్తాయని, యువత అధికంగా తప్పుదారి పడుతున్నారని పిల్లలపై తల్లిదండ్రులు నిఘాఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రిశాంత్ రెడ్డి, డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో మల్లెపూల గుబాళింపు



తొట్టంబేడు, మార్చి 15 ప్రభాతవార్త

మల్లెపూలకాలం.. వేనవికాలం. మండువేసవిలో కూడా మనస్సు హత్తుకునేలా పరిమళించేంది మల్లెపూలు మాత్రమే. పలు గ్రామాల్లో మల్లెతోటలు ద్వారా పలువురు ఉపాధి పొందుతున్నారు. రైతులందరు వరి, వేరుశనగ, చెరకు పంటలవైపు ఆసక్తిచూపుతుంటే మరికొందరు రైతులు మాత్రం ప్రత్యామ్నాయంగా పూలతోటలు, కూరగాయాలు పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ, పూడి, శేషమనాయుడుకండ్రిగ, జ్ఞానాంబకండ్రిగ గ్రామాలతోపాటు శ్రీకాళహస్తి మండలంలోని వేడాం మార్గంలో మల్లెతోటల గుభాళింపులు కనువిందుచేస్తాయి. తోటల నుంచి వ్యాపారులు కిలో రూ.200కు కొనుగోలు చేసి పట్టణంలో కిలో రూ.300 నుంచి రూ.400వరకు అమ్ముకుంటు లాభాలు గడిస్తున్నారు. ఇక మల్లెపూలతో పాటు కాగడాలు పువ్వులు, కనకాంబరాలు ఇవి కూడా ఆదాయాన్నిస్తున్నాయి. తోట యజమానులు మల్లెపూలతోటలను సంరక్షించేందుకు చర్యలుతీసుకుంటున్నారు. తోటలో వచ్చిన మల్లెపూలు కోసేందుకు కూలీలకు కిలోకు రూ.35లు చొప్పున పైనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఇవికాకుండా ఇతర ప్రాంతాలకు కూడా మల్లెపూలను ఎగుమతి చేస్తున్నారు. ఏది ఏమైనా మండువేసవిలో మల్లెపూల గుభాళింపు ఇస్తున్నాయి.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం




తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 15 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద 11 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డిఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐ కృపానంద టీమ్ రాజంపేట రేంజ్ ఎస్ఆర్ పాలెం సెక్షన్ రోళ్లమడుగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. పెద్దకోన తలగడ వద్ద కొందరు వ్యక్తులు దుంగలను మోసుకెళుతూ కనిపించారు. వారిని హెచ్చరిస్తూ సమీపించేసరికి, వాళ్లు దుంగలను వదిలిపెట్టి పారిపోయారు. ఆ ప్రాంతంలో 11 ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగలు స్వాధీనం చేసుకుని, పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా ఫుట్‌బాల్‌కు సహకారం అందిస్తా : జయప్రకాశ్



శిక్షణా శిబిరం ప్రారంభిస్తున్న జయప్రకాశ్

పుత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త :

మహిళల ఫుట్‌బాల్ అభివృద్ధికి, క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ అన్నారు. బుధవారం పట్టణంలో డిగ్రీ కాలేజీ మైదానంలో మహిళా ఫుట్ బాల్ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టూరిజం శాఖ మంత్రి ఆర్.కె.రోజా సహకారంతో రాష్ట్ర సీనియర్ మహిళా ఫుట్ బాల్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో జట్టును ఎంపిక చేసి ఈ నెల 22వ తేదీన గోవా రాష్ట్రంలో జరిగే అంతర్ రాష్ట్ర మహిళా ఫుట్ బాల్ టోర్నమెంట్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ నవీన్‌కుమార్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పిడి సూరిబాబు, ఇంకా ఎ.హరినాథ్‌రెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీలుగా ఎవరు గెలిచినా రికార్డే!

చిత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త:

ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరు గెలిచినా సరికొత్త రికార్డు సృష్టించిన వారు కానున్నారు. చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎవరు విజేతలుగా నిలుస్తారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పిడిఎఫ్ అభ్యర్థులతో పాటు అధికార వైకాపా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అభ్యర్థులతో పాటు బిజెపి, ఇండిపెండెంట్ అభ్యర్థులు పలువురు తమ అదృష్టంను పరీక్షించుకోనున్నారు. రాష్ట్రంలో 2007 సంవత్సరంలో శాసనమండలి పునరుద్ధరించిన ప్పటి నుండి ఇప్పటి వరకు ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. గతంలో జరిగిన మూడు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు అప్పట్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులపై పైచేయి సాధించి విజయకేతనం ఎగురవేశారు. 2007, 2011, 2017 సంవత్సరాల్లో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు విజయం సాధించి హ్యాట్రిక్ విజేతలుగా నిలిచారు. అప్పట్లో జరిగిన ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్, తెలుగుదేశ పార్టీలు గెలవడానికి శక్తివంచన లేకుండా కృషి చేసినా పిడిఎఫ్ అభ్యర్థుల హవాలో వీరు తుడిచి పెట్టుకొని పోయారు. ప్రస్తుతం జరిగిన ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్ళీ పిడిఎఫ్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి పోరాటం సాగించారు. ప్రస్తుతం జరిగిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో వరుసగా నాల్గవ సారి విజయం సాధించి సరికొత్త రికార్డును సృష్టించాలని పిడిఎఫ్ అభ్యర్థులు ఉవ్విళ్ళూరు తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలో వున్నప్పటికీ ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను అధికారంలో వుండి ఇప్పటి వరకు కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు విజయం సాధించలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ కనుమరుగు కావడంతో ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేతిలో వుండగా ప్రతిపక్షంగా తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోంది. ప్రస్తుతం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించి సరికొత్త రికార్డును సృష్టించడానికి ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో చాలా శ్రమించింది. ఈ ఎన్నికల ఫలితాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఏ ఒక్క స్థానం నుండి అధికార వైకాపా మద్దతు ఇచ్చిన అభ్యర్థి విజ యం సాధిస్తే అది సైతం రికార్డు సాధించినట్లే అవుతుంది. ప్రస్తుతం జరిగిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో రెండు ఎమ్మె ల్సీ స్థానాలు సైతం తమ పార్టీ ఖాతాలోనే పడుతాయని అధికార వైకాపా నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన పట్టభద్రుల స్థానం అభ్యర్థి ఈ ఎన్నికల్లో విజయం సాధించిన అది ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి సరికొత్త రికార్డు సాధించినట్లే అవుతుంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి అధికార వైకాపాకు గట్టి దెబ్బ కొట్టాలని భావిస్తున్న ప్రతిపక్ష తెలుగుదేశం ఎన్నికలకు ముందే పిడిఎఫ్ అభ్యర్థులతో అవగాహనకు వచ్చింది. మొదటి ప్రాధాన్యత ఓటు తమ అభ్యర్థికి వేసుకొని రెండవ ప్రాధా న్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థికి వేయాలని తెలుగుదేశం బహిరం గంగా పిలుపునిచ్చింది. అలాగే పిడిఎఫ్ సైతం ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తమ అభ్యర్థికి వేసి రెండవ ప్రాధా న్యతా ఓటును తెలుగుదేశం అభ్యర్థికి వేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థికి మేలు జరిగి వుంటుందని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఆశలు పెట్టుకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల ఎక్కింపును గురువారం చేపట్టనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంకు సంబంధించి తక్కువ ఓట్లు వుండటంతో గురువారం నాడే ఫలితం వెల్లడి అయ్యే అవకాశం వుంది.